పశువులకోరం

"కరుణకుమార"

"మామా! వాకిలి తియ్యి: మామా! వాకిలి, వాకిలి!"

పెట్టకూత వినబడ్డ పుంజులాగ, చెవులు బారజేసి చేసుకొని ఆప్యాయంగా ఆలకించాడు ఆ పిలుపు- సాలలో గుర్రానికి మాలీసు చేస్తున్న రొబ్బయ్య; వడివడిగాపోయి వాకిలి చిలుకు తీసి తలుపు తెరిచాడు, గడపలో నిలబడ్డ పెంచెల్ని ఆహ్వానంచేస్తూను.

"వాకిలి బిగించుకొన్నావేందయ్యా, సంజ కాడ? లోగా చిల్లాటలాడుతుండావా ఏంది?" అని కిసుక్కున నవ్వింది పెంచెలి.

"ఆడుతూనే వుండా" అన్నాడు బింకంగా, రొబ్బయ్య.

"దేనితో?..............." అని తెల్లమొగం వేసింది పెంచెలి.

"నీ తోనే..............."అని సరాగంగా అన్నాడు రొబ్బడు.

"ఊఁ!..............." అని దీర్ఘం తీస్తూ నెత్తిమీది గడ్డిగంప రెండుచేతులతోనూ పట్టుకొని ఒకమె ట్టెక్కింది పెంచెలి. గిల్లితే పాలుగారే దాని బుగ్గమీద చిటికెతో కొట్టి గడ్డిగంప తన రెండుచేతుల్లోకి తీసుకొన్నాడు రొబ్బడు.

వాకిట్లో రొబ్బడి దర్శనంతోనే తన శరీరం తేలిక అయిపోయిన పెంచెలికి నెత్తిమీది గంపకూడా తొలగేవరకు పిట్టలాగ ఎగిరి రొబ్బడితోకూడా గుర్రపు సాలలోకి దూకిందది.

"మామా! గుర్రానికి గడ్డి మట్టసంచేసి తెస్తుండానని, దినమ్మా నీపోశు పడలేక, ఈపొద్దు చేతులు బొబ్బలెక్కేటట్టు దోకి దోకి, తెచ్చాను చూడు! అరిచేతు లెట్లా పుళ్లుపడ్డాయో?" అని రెండుచేతులూ రొబ్బడికి చూపింది. తన రెండుచేతులతోనూ పెంచెలి పాణిగ్రహణంచేసి ఆమెను చూస్తున్నాడు రొబ్బడు.

"ఎండలు ముదిరినై మామా! పచ్చని గరికపోచ సిక్కడంలేదు. నేల తడి ఆరి గట్టిపడి రాయిలాగ పొద్దుగూకులూ ఎంతదోకినా - దోకుడుపార అణిగి మొద్దుబారడం, చేతులు పుల్లెక్కడం తప్ప- గంపమట్టానికి కూడా రావడంలేదు గడ్డి. ఇక తేకుంటే మామ కోపం చేస్తాడుగాబోసని మోసుకొని తెచ్చా" అని తలపైకెత్తి మామకళ్లల్లోకి చూచింది పెంచెలి.

"కష్టం చేయకుంటే కడుపులోకి బువ్వ ఏడనుంచి వస్తుందనుకొన్నావు?" అంటూ బొబ్బలెక్కిన పెంచెలిచేతులు తన కళ్లల్లో పెట్టుకొని ఆమెను దగ్గరగా లాక్కొన్నాడు రొబ్బడు. పెంచలి బాహువల్లరులు రొబ్బడి కంఠసీమను చుట్టవేసుకొన్నవి. నుదుటిమీది నీటిచుక్కలు చేత్తో తుడిచి, ఆమెను సందిట్లోకి లాక్కొని ఫాలభాగంమీద తన పెదిమెలు మెదిపాడు రొబ్బడు. పెంచెలికి ఆదినంచేసిన కాయకష్టం అంతా హరించి ఆనందం పొంగింది.

"వొదులు మామా! వొదులు: ఎవరన్నా సూస్తే సిగ్గు బోయేను" అని విడిపించుకోబోయింది పెంచెలి.

పైట జారగా రవికెలో బిరెక్కిన చిన్నిరొమ్ము ఒక్కసారిగా కంపించి చలించినట్లుతోచింది రొబ్బడి దృష్టికి. ఆచలనంలోనే అతని హస్తచిత్తచాంచల్యాలు కూడా ఒక్కసారిగా అలుముకొన్నాయి.

"ఇహిహిహిహీ" అంటూ గుర్రం సకిలించింది. పరధ్యానంలో వినబడ్డ సకిలింపుకి ఉలిక్కిపడి...

"అమ్మో! ఎవరో వస్తుండా"రని పట్టు విడిపించుకొని పైట సవరించుకొంది పెంచెలి.

"ఎంత పిరికిపిల్లవే!" అంటూ గుర్రంవైపు మళ్లీ మాలీసు ఆరంభించాడు రొబ్బడు.

చీరకొంగున కట్టిన మూట విప్పి వక్కముక్క పంటిసందున కటిక్కుమని కొరికి, సగంముక్క మూట లోనే వేసుకొని, ఆకు చుట్టి నోట్లోపెట్టుకొంటూ, గోడకానుకొని కూర్చుంది పెంచెలి.

రొబ్బడు గుర్రానికి మాలీసుచేస్తున్నాడు; తొడ లదిగని లంగోటీ, కండలు తిరిగినదేహం, నిడుదైన వక్షస్థలం — పిక్కలమీది కండలు చెండుల్లాగ ఉబికేటట్టు, నేలకు కాళ్లురెండూ బిగదన్ని, గుర్రం డొక్కలికి తల మోటించి, ఊపిరి బిగబట్టి రెండుచేతులతోనూ తనశక్తి కొద్దీ గుర్రానికి మాలీసుచేస్తున్నాడు రొబ్బడు. మోటు రాళ్లనుపిడిగుద్దులచే ముక్కలు చేయగలబలం; లేవ దాటి టెంకకట్టినయౌవనం: తన బలమేమో, ఎదురుగా నిలబడ్డగుర్రం బలమేమోకూడా భేదం తెలుసుకోలేని నిర్లక్ష్యం — చేతులు మంటలెత్తేటట్లు గుర్రాన్ని రుద్దుతున్నాడు రొబ్బడు. గుర్రంకూడా పొట్టకిందా, మెడకిందా, నడుములమీదా నొప్పులు తీరేటట్టు మర్దనా చేయించుకొంటూ, తన్నాస్థలంలోనుంచి అడుగుదీసి అడుగుపెట్టేటట్టు కదిలించు చూతామంటూ, వెనక కాళ్లు వెనక్కీ, ముందుకాళ్లు ముందుకీ గట్టిగా తన్నిపట్టి నిలబడేఉంది. గుర్రమూ, రొబ్బడూ ఒకరిమీద ఒకరు పంతాలువేసుకొని కలియబడ్డారు. కాని ప్రపంచంలో గల జవం అంతా బ్రహ్మదేవుడు తన నాలుగు కాళ్లలోనే పెట్టినసంగతి ఆగుర్రం మరిచింది కాళ్లు నేలకి తన్నిపట్టి తల గుర్రాని కానించి, "హుమ్మ"ని హుంకరిస్తూ మర్దించేవరకు, ఏనుగవంటి ఆగుర్రంనడుము ఉండీలబద్దలాగ జవజవలాడుతూ వంగి, వెనకకాళ్లు రెండూ కలగదొక్కుకొని ఆపక్కకి కిందపడబోయింది.

"ఆఁ! భద్రం! మోటుతనం చేయవోక!" అని గోడ కానుకొన్న పెంచెలి రొబ్బణ్ని హెచ్చరించింది.

కిచకిచలు పెట్టిన పిల్లలు నవ్వినట్లుగా "ఇహి హిహిహీ" అంటూ గుర్రం మళ్లా సకిలించింది.

రొబ్బడు ఎడంగావచ్చి చేతులు దులుపుకొన్నాడు.

"ఏందీ, ఒళ్లంతా ఆ చెమటలు! అయ్యో! నీళ్లల్లో మునిగి లేచినట్టుండావే! మరీ అంతమోటుతనమా? ఇట్టా రా! ఇట్టా వచ్చి కూకో, ఒళ్లోపాలి తుడుస్తాను రక్వంత తాళి మళ్లా పట్టొచ్చులే!" అని మామను పిలిచింది పెంచెలి.

"ఉస్సు" మంటూ పెంచెలి కెదురగ్గా మోకాళ్ల మీద మోచేతులు పెట్టుకొని కూర్చున్నాడు. రొబ్బడు. చీరకొంగు తీసి అతని వక్షస్థలం, వీపూ, చేతులూ, ముఖం- అన్నీ తుడిచింది పెంచెలి.

రొబ్బడికి అలుపుతీరింది చెదిరిపోయిన అతని క్రాపింగులోని వెంట్రుకలు చేత్తో సవరిస్తోంది పెంచెలి.

"పిల్లా! బిడ్డల్నికనే ఈడు వచ్చీకూడా, మనిద్దరికీ ఎన్నాళ్లీదొంగచేష్టలు?"

"అయితే నాకు పెళ్లి చేయమని మా అయ్యనీ, అమ్మనీ నానోటితో ఎట్లా అడిగేది, నువ్వే చెప్పూ?"

"ఏమి అడిగితే ఎగ్గా?"

"ఎంత బాగుందదీ యిద్దూరం! అంత ఉబలాటంగా ఉన్నవాడివైతే, నువ్వే వచ్చి మా అయ్యనడగ్గూడదూ?"

"మొగజన్మఎత్తి మూతిమీద మీసంగలవాడు, ఓ పరాయి మొగాణ్ణి పిల్లనివ్వమని నాలిక తెగ్గోసినా అడగ్గలడా?"

"నీ కెంతరోషం ఉండదో, ఆడదాన్ని నాకూ అంతే ఉండది"

"అయితే పెళ్లి చేసుకోకుండా ఈమోయిన కూకుంటావా?"

"మొగోడివి నీకు లేని తొందర నాకేమొచ్చె? నువ్వు అజ్జాయిస్తే, నేనూ అజ్జాయించే ఊరకొంటూటికే—ఎకానీ అప్పటిదాన్పటికిప యిరి."మో

అని రొబ్బడివెనక చేరి వీపుమీదిమట్టి నలుస్తూ కూర్చుంది పెంచెలి.

రవ్వంత నిదానించాడు రొబ్బడు.

"ఇంక గడువుపెట్టే క్రియ లేదు. ఎప్పుడు నీమెళ్లో తాళిబొట్టు కట్టేనా, గుఱ్ఱంమీద నిన్నెక్కించుకొని ఎప్పుడు ఉత్సవం చేసుకొనేనా, ఎప్పుడు నీ బుగ్గలు పులిమేనా-అని నాకూ ఉబలాటంగానే ఉండది. మా సూపరెంటుదొరనికూడా అడిగాను. ఓ! అభ్యంతరం లేకుండా తీసుకొని పొమ్మన్నాడు గుఱ్ఱాన్ని. పిల్లా! పసుపుబట్టలు కట్టుకొని, ఈ చింతపువ్వువన్నె గుఱ్ఱంమీద నిన్ను కూకోబెట్టుకొని, గాజుదీపాలేసుకొని, ఔట్లు పేల్చుకొంటూ, ఉత్సవం చేసుకొంటే, నేను రాజులాగా ఉండనంటే!" అని మెడ వెనక్కు వాలేసి పెంచెలి ఒడిలోకి ఒరిగాడు రొబ్బడు.

"నువ్వు రాజులాగుంటే నేనుమాత్రం రాణిలాగ ఉండనంటయ్యా?" అని అతని చెక్కిళ్లమీద రెండు చిట్టి దెబ్బలు కొట్టింది పెంచెలి. "ఏదీ ఒక్క ముద్దియ్యవే పిల్లా!" అంటూ ఆమెముఖం తనముఖంలోకి లాక్కున్నాడు రొబ్బడు.

"నిజంగా మీదొర గుఱ్ఱాన్ని ఇస్తానన్నాడా మామా?" అని ఆత్రంతో అడిగింది పెంచెలి.

"నిజంగానే: నేనంటే మా దొరకి గుండెలో గుండెకాయ. అయిదువందలు కరుకులుపోసి మోజుపడి కొనుక్కున్నజీవం. దన్నిడబ్బిచ్చి ఆయన కొనుక్కోవడమేందో, దానిపోషణకి నా చేతిలో పెట్టడం ఏందో- అంతే! ఇంక దొర మళ్లా గుఱ్ఱంమాట మరిచిపొయ్యేటట్లు చేశానుగాని ఏమరి ఉండాననుకొన్నావా? రేపటేళ అనకుండా, మాపటేళ అనకుండా బిడ్డని సాకినట్లు సాకుతుండాను గనకనే తలవెంటికవాసికూడా తగ్గిపోకుండా ఏనుగలాగ ఎట్లా ఉండదో సూడు. వేడుకగా పెళ్లి చేసుకొంటానంటే ఉత్సవానికి ఒక్కపూట గుఱ్ఱమే ఇవ్వననడానికి ఆయనకి నోరువస్తదా మొదలు?"

"మామా! నాకు గుఱ్ఱంమీద కూకోవాలంటే భయమే."

"నేనుండానుగా. వెనకతట్టు కూచోని పట్టుకోనూ?"

"అబ్బో: ఆమాట తలుసుకొంటూంటే ఒళ్లు జలదరిస్తాం దయ్యా! మరి గుఱ్ఱం ఉండి ఉండి ఒక్కసారి పేరెంతీస్తేనో?"

"తీస్తదా? మనం నిలుచోమంటే నిలుచోవాలె! కదంతొక్కమంటే తొక్కాలె! తరటుపొమ్మంటే పోవాలె! గాలప్ తీయుమంటే తీయాలె! అంతేగాని దానిష్టప్రకారం పోడానికి గుండెలుండాయా?"

గుఱ్ఱం మళ్లా సకిలించింది.

"మామా! ఆగుఱ్ర మెక్కి మావూరు వూరంతా వూరేగాలె. ఈజన్మ ఇక ఈడేరినట్లే అవుతదినాకు."

"మీ వూరే అన్నమాటేందే పిల్లా! ఈ నగరం అంతా తిప్పనంటే! గుఱ్ఱాన్ని లొంగగొట్టడంలో రొబ్బడంతటి సైను ఉండాడా అనిపించుకొన్నా! ఓ! నీసరదా తీరేటట్లు దేశం అంతా తిప్పతా గుఱ్ఱం దిగకుండా."

"అట్టయితే నే నీరాత్రికే మాఅమ్మకగ్గర అంటానుండు పెళ్లిసంగతి. మామా! నువ్వన్నట్లు మన కీ దొంగచెల్లాటాలు బాగులేదే! ఏం దీకర్మ: మనిద్దరం ఇష్టపడ్డాక ఇంక నలుగు డేమొచ్చె!"

రొబ్బడు సరేనని లేచి నిలబడి చెడ్డీ కంటుకొన్న మట్టి దులుపుకొన్నాడు.

తనకు కాబొయ్యేమగడూ, అతని ఎత్తునే నిలబడ్డ ఉన్నతమైన గుఱ్ఱమూ, ఇద్దరూ రెండు పురుష సింహాల్లాగ గోచరించారు పెంచెలికళ్లకు. ఆ ఇద్దరినీ ఆత్రేచూచుకొని మనస్సులో నేపొంగిపోయింది పెంచెలి.

"సీకటిపడింది: పరుగుదూరం పోవాలె, మామా! రేపు మళ్లా వస్తా........." నని గడ్డిగంప చంకనబెట్టుకొంది. జారిపోయిన కొప్పుముడి సవరించుకొంటూ,

కట్టికొన్న కుచ్చిళ్లు చక్కజేసుకొంటూ, పైట కొంగు నడుంచుట్టూ తిప్పుకొంటూ జరజర, జరజర నడచిపోయింది పెంచెలి. పోతూఉండే పెంచెల్ని ఆట్టే పరకాయించి చూచి చూచి, గడప దిగి వీధిలోనికి పోంగనే,

"సేసుకొంటే ఇట్లాంటిపిల్లనే సేసుకోవాలె; సుకపడాలె"నని అనుకొంటూ, గుర్రానికి దాణాపెట్టడానికి ఉలవలసంచీ మూతి విప్పాడు రొబ్బడు.

౨

పెంచెలికాపురంవుండేవూరు ఆ నగరానికి పరుగుదూరంలో వుంది. చీకటి దట్టంగాకముందే ఇల్లు చేరుకోవాలని పరుగులుతీస్తూ ఇంటిదారిపట్టి పోతోంది పెంచెలి: మంచియౌవనంలోఉన్న రొబ్బడూ, తనూ రొబ్బడూ కలిసికూచొని ఊరంతా ఊరేగగలచే యెత్తు గుర్రమూ, తన మాలవాడలో వివధూవరులకీ లభ్యపడని అపూర్వమైన అశ్వారోహణభాగ్యమూ – ఈ తలపులన్నీ పెంచెలి మనస్సు వికసింపజేసి, శరీరం పులకరించి, ఆమె ఒక విధమైన ఉత్సాహంతోనూ, ఉద్రేకంతోనూ తొందరగా పోతోంది.

తనవూరు ఇక అరమైలుదూరం ఉంది. కని చీకటి పడుతూపడుతూఉంది. డబడబమని ఆకాశంలో పెద్ద ఉరుము ఉరిమి, పెంచెలి హృదయాన్ని చెదరగొట్టింది. అమ్మో! ఎక్కడనో పిడుగు పడిందే అనుకొంటూ తటాలున వెనక్కి తిరిగి ఆకాశంలోకి చూచింది. సూర్యభగవానుడేలోకంలోకి జారిపోయాడో కాని నల్లని కాటుకకొండలు రెక్కలు కట్టుకొని ఆకాశంలోకి ఎగిరి పెంచెల్ని తరుముకొని వస్తున్నాయి. పెద్దగాలీ వానా వచ్చి తాను తడిసిపోతానన్నభయంచేత పెంచెలి కాలివేగం వృద్ధిచేసింది. కాని అంతా కనురెప్పపాటు దృశ్యం. కళ్లు చీకట్లుకమ్మే మెరుపులు మెరవడ మేమిటో, మేఘాలు పరస్పరమూ పరామర్శచేసుకొని ఒరుసుకొని గర్జించడ మేమిటో, తూర్పు సముద్రం మీదుగా ఎగిరివచ్చే గాడ్పులు పశ్చిమగోళం వరకూ వ్యాపించడ మేమిటో— అంతా అయిదు నిమిషాలలోనే. నల్లని ఆకాశం కరిగి నీరయిపోయింది. వడగళ్లరాళ్లవాన దౌష్ట్యానికి పెంచెలి ఓర్చుకోలేకపోయింది. వడగళ్లతాకుడు—కావలెనని ఎవరో దుండగీంద్రుడు ఆమెను రాళ్లతో విసరివిసరి కొట్టుతున్నట్లుగా వుంది. రొబ్బణ్ణి ఎంతస్మరించుకొన్నా తన సాదకోను రాలేకపోతున్నాడు. రళ్ల దెబ్బలు తప్పించుకొనే ఉపాయం ఊహించుకొనేలోపలనే, ఆమె ఆపాదమస్తకమూ తడిసి ముద్దయిపోయింది. తలమీద వడగళ్లదెబ్బతగలకుండా కాపాడుకొనేనిమిత్తం చంకన వున్న ఖాళీ గడ్డిగంప నెత్తిని బోర్లించుకొంది. అప్పటికప్పుడే కారుమబ్బులు దశదిక్కులా ఆక్రమించుకొన్నవి. పొద్దెంతపోయిందోకాని, కటికిచీకటి కుంభవృష్టితోపాటు లోకాన్ని ముంచెత్తివేస్తోంది. నెత్తిమీది గంప తనదృష్టికి కొంతఅడ్డుతగిలేవరకు, దారివెతుక్కొంటూ. అడగులో అడుగుపెట్టుకొంటూ పోయే పెంచెల్ని, ఒక పెనుగాలి చేతుల్లోఎత్తుకొని, ఇరవైగజాలదూరంలో ఒకకానుగచెట్టు మొదటిలోకి తీసుకొనిపోయి దింపింది.

నెత్తిమీదిగంప పైకెత్తి పక్కగా చూచేసరికి, సమీపంలోనే వున్న దొకపెద్దపశువుల కొటం. తల దాచుకోను రక్షదొరికినందుకు సంతోషిస్తూ ఆ పశువుల పాకలోకి దుడుంగున దూరింది పెంచెలి; వానజల్లు తగలకుండా ఆ పాకలో ఒకమూల ఒదిగి, చలికి గడగడ వణికేదేహాన్ని కాపాడుకొంటోంది. బయట వానదేవుడూ, వాయుదేవుడూ ఒకరితో ఒకరు పంతాలువేసుకొని ప్రాణికోటులకు తగిలేదీ, తప్పేదీ తెలుసుకోకుండా విచ్చలవిడిగా విహరిస్తున్నారు. తళుక్కుమని మెరుపులు మెరిసినపుడల్లా ఆ కొటంలో రెండువరసలుగా దగ్గరదగ్గరగా కట్టివేసి, గాటిలో గడ్డి మేస్తూఉండిన ఆ బోతులలాంటి పడమటెద్దులూ, తెల్లని వాటి మూపురాలూ, అందమైనకొమ్ములూ, గాంభీర్యమైన వాటిముఖంలోని నేత్రాలూ— అన్నీ ఒక్కసారిగా పెంచెలికళ్లకు గోచరిస్తున్నాయి. ఆ ఆపత్సమయంలో ఆ ప్రదేశం అంతా నిర్జనప్రదేశంగా ఆమెకు పొడగట్టినప్పటికీ, రొబ్బడిలాగ, రొబ్బడి చేతుల్లో పెరిగే గుర్రంలాగ, బలిష్ఠమై దేహసౌష్ఠవం

గల, అన్ని వృషభరాజములు ఆమె దండనుండగా చూచుకొనేవరకు, తన ప్రాణాని కేమీ భయంలేదని ఆ అబల కొకవిధమైన ధైర్యం కలిగింది. గాలీ, వానా రవంత తెరిపియిస్తే, ఎంతలోపోవాలి ఇంటికి! ఇంక ఊరు పదిపగ్గాలదూరంలో ఉంటుందేమో!

తడిసిపోయిన రవిక శరీరాని కంటుకొని పోయింది. నీళ్లుకారే పైటకొంగు తీసి పిండుకోవడానికి ఒకటి రెండుసార్లు ప్రయత్నించిందిగాని అన్ని ఎద్దుల సమక్షంలో పైట తొలగించుకోనిచ్చిందికాదు ఆమె శీలం.

ఎద్దులముందు గాటిలోని ఎండుగడ్డి విదిలించి, వామిలోనుండి తెచ్చిన జొన్న చొప్పకట్టల్ని విరిచి ఎద్దులముందు వేసుకొంటూ ఆ చివరనుండి ఈ చివరికి వస్తున్నాడు రాయుడి సేద్యగాడు మతరాచు సుబ్బడు. ఆ పాకలో మనిషిసంచారం సవ్వడి తెలుసుకొనేవరకు కుదుటపడవలసిన పెంచెలిమనస్సు భీతిచెందింది— ఎందువల్ల? మతరాచు సుబ్బడివి వేసుకొక్క ముక్కులా ఏమిటి, లేకుంటే ఆ గాఢాంధకారంలో పెంచెలి సవ్వడి అత డెట్లా పసిక ట్టగలిగాడు!

"ఎవ రామనిషి?" అని ప్రశ్నించాడు సుబ్బడు.

బదులు లేదు.

"ఎవరంటే మాట్లాడవేం?" అని పనిపించాడు సుబ్బడు.

"నేను చిన్నాయనా! పెంచెల్ని"

"ఏ పెంచెలివే?"

"నేనయ్యా, వెంకటిగాడి కూతుర్నయ్యా! గడ్డి అమ్ముకొనివస్తుంటే వానకు తడిసి ఇట్లా వచ్చా" అన్నది పెంచెలి.

"ఎవర్రా ఆ మనిషీ?" అని ఆపాక చివరినుండి ఆ చీకట్లో ఇంకో ప్రశ్న బయల్దేరింది.

జవాబు లేదు.

"ఒరే సుబ్బా! ఎవర్రా ఆ మనిషి?" అని మళ్లా వచ్చింది ప్రశ్న!

జవాబు చెప్పకుండానే సుబ్బడు పెంచెల్ని విడిచి ఎద్దుల్లో జొరబడి ఆ చివరికి వెళ్లిపోయాడు.

"ఎవరితోరా నువ్వు మాట్లాడుతుండేదీ?"

"అదే........."

"అదే అంటే?........."

"అదే సామీ! నువ్వు కోరుకొన్న మనిషే! వెంకటిగాడి కూతురు."

"పెంచెలే! ఈడ కెందు కొచ్చిందీ?"

"గడ్డిఅమ్ముకొని ఇంటికి పోతుండదంట! వాన వచ్చేవరకు పాకలోకి దూరింది."

"ఒరేయ్: సుబ్బా: ఇదేరా సమయం. చిక్కింది! లంజ. ఇక పోలేదులే ——"

"..............."

"నేను ఈడుండానని దానితో చెప్పకుండా చెయ్యిపట్టుకొని దాన్నిట్లా లాక్కురా!"

"తలా, ఒళ్లూ, గుడ్డా అన్నీ తడిసి ముద్దయి పోయిందే: అబ్బే. ఈకడవ పోనీ. ఇంకోపాలి పిలుచుకొని వస్తాలే."

"అట్లా కాదురా. ఆలంజ చెయ్యిజారితే మనకు చిక్కదురా—నీకు తెలీదు. దాని కోసరం ఇప్పటికి ముగ్గురిచేత కబురుచేశాను. అది రానని చెప్పింది. ఈ సమయం పోగొట్టుకొని ఉపయోగం లేదు."

"................."

"నీ కెందుకు నువ్వుపోయి దాన్నిట్లా లాక్కొని వద్దూ. తరువాతసంగతి నేను సరసపెట్టుకొంటాను."

ఫెళఫెళమని పెద్ద ఉరుము ఉరిమింది. పరధ్యానంలో ఉండిన పెంచెలి జడుసుకొని మెరుపుతీగలాగే దాని శరీరం కంపించి వంకలు తీసింది. నోటిలోకి తీసుకొన్న గడ్డి నోటిలోనే పెట్టుకొని, నములడం చాలించి, మెడలెత్తి నిర్ఘాంతపోయి చూస్తున్నాయి ఆ వృషభరాజములు. గాలీవానా చేయీచేయీ కలుపుకొని వాటి ఇష్టంవచ్చినట్లు చెలగాటా లాడుతున్నాయి.

"ట్రుఁ" మని ఎద్దుల్ని అదిలించుకొంటూ, దారి తోలిగించుకొంటూ పెంచెలిదగ్గరికి వచ్చాడు సుబ్బడు. ఏదో సమాధిలో ఉండినట్లు తదేకధ్యానంలో కదలకుండా మెదలకుండా నిలబడేఉంది పెంచెలి.

"ఏమే" అని పలకరించాడు సుబ్బడు.

"అమ్మో! ఎంతవానో! ఎంతగాలో! ఇదేం ఖర్మమయ్యా, ఇయ్యేల ఇంటికి పోనిచ్చేటట్లు లేదే, ఈ మాయదారివాన!" అన్నది పెంచెలి.

"ఇంటికి పోవచ్చుగాని, రాయుడు చెప్పిపంపితే రానన్నావట! నీ కేమంతపొగరే!" అన్నాడు సుబ్బడు.

జల్లుమని కంపించింది పెంచెలిదేహం: అప్పటికి స్ఫురణకువచ్చింది తాను దూరిన కొఠం రాయుడి దని. కాని, రాయుడు అప్పుడు అక్కడనే ఉన్నాడని ఆమె కింకా తెలియదు.

"నిన్నే! అడుగుతుంటే పలకవేమే? మాలలం జవు: నీ బతుక్కు అట్టాంటి మారాజు వెయ్యిజన్మా లెత్తినా చిక్కుతాడా? లచ్చనంగా ఇంతబంగారు పెడతాడు. డబ్బా, దస్కమూ ఇస్తాడు: నీ కేమంత గాడా! ఆయన రమ్మంటే రానన్నావుట-ఎందువల్ల?"

"ఊరుకోవయ్యా! సుబ్బయ్యా! ఇట్టాంటి ముచ్చట్లు నాకాడ ఎత్తవోకయ్యావు, బాగుండదు!"

"బాగుండక చేదా ఏందే! రాయుడు మోజు పడి కులమయినా పాటించకుండా అడుగుతుంటే ఎన్నాళ్లని ఇట్టా ఎగర్తించి పోగలవే! పిచ్చిపిచ్చి చేష్టాలు చేయవోక. నే తీసుకొనిపోతా, రా!"

ఆకాశంలో మేఘాలు ఒరుసుకొన్నట్లే పెంచెలిగుండెలుకూడా రాపిళ్లుపడుతున్నాయి. పెంచెలి నోరువిప్పలేదు.

"రా. రాయుడు ఈడనే వుండాడు. రా! ఆయన్ని ఎగర్తించి పోబోక: చెడిపోగలవు" అన్నాడు సుబ్బడు.

ఆసమయంలో రాయుడు ఆ కొఠంలోనే ఉన్నాడన్న సంగతి వినేవరకు పెంచెలికి దడపుట్టింది.

"అమ్మయ్యో! ఈడకెందు కొస్తినే! పెద్దపులి నోట చిక్కితినే దేవుడా" అని లోలోపలనే భయ పడింది.

"ఇట్టా రా!" అని దానిచెయ్యిపట్ట బోయాడు సుబ్బడు.

గల్లుగల్లుమని దాని బిళ్లోరిగాజులు పెద్దశబ్దం చేశాయి. అంబా అని ఒక ముసలిఎద్దు అరిచింది.

"సుబ్బా! లాక్కొనిరారా లంజని: దాని సొయ్య మణచాలి" అని ఆచివరినుండి గర్జిస్తూనే ఉంది రాయుడు సింహం.

"బాబో, వీళ్లు నన్ను బతకనివ్వ" రని అంటూ కింద పెట్టిన గడ్డిగంప చేతికి తీసుకొని వాకిట్లోకి దూకింది పెంచెలి.

"ఏడకి పోతావే!" అని మీదికి దూకి గంప పట్టుకొన్నాడు సుబ్బడు.

"పోనియ్యబోకురా" అని అరుస్తూనే ఉన్నాడు రాయడు.

"నీ తల బద్దలు కానూ, నీకే మంతపొయ్యేకాల మయ్యా! సుబ్బయ్యా!" అని పెద్దఅరుపు అరిచి సుబ్బడి చేతిలో గడ్డిగంప విసిచిపెట్టి చీకట్లోకి పారిపోయింది పెంచెలి. దాన్ని వెన్నంటి తరుమబోయిన సుబ్బడు కాలుజారి కిందపడిపోయి, లేచేలోపల పెంచెలిజాడ అయోమయమైన ట్లనిపించింది సుబ్బడికి.

"పోనిచ్చావేమిరా పెద్దమ్మా? అన్నాడు రాయుడు.

"దాని కిష్టంలేనిది మనం ఎంతచేస్తేమట్టుకు చిక్కుతుందా ఆడది?"

"ఏడవక పోయినావు. పెద్దమ్మా:—కాదురా: చేతికిచిక్కిన ఆడదాన్ని పట్టుకొని రాలేకపోయి నావే— ఏడవనా నువ్వుండి!"

"నన్నేం చెయ్యమన్నావయ్యా; అది తప్పించుకొని పారిపోతేను.

"అఘోరించావులే. ఇంతట పోగొట్టితే పోగొట్టావు కాని రేపు తెల్లవారి దాన్ని నవ్వు ఖండితంగా అడిగి తెలుసుకో; తెలిసిందా?"

"సరే: అట్టనే అడుగుతాలే."

"మాడు: పదిసవరలు బంగారు ఇస్తానని చెప్పు: మంచి పగడాలపండ ఇస్తానని చెప్పు. ఒప్పుకోంటుందిలే: ఇంకా పసిది కాబట్టి జంకుతున్నది."

"అట్టనే" అన్నాడు సుబ్బయ్య.

వానరవ్వంత తెరపి ఇచ్చినతర్వాత ఇద్దరూ ఇళ్లకి పోయారు.

పెంచెలి ఎట్లా ఇంటికి ఘటం చేరవేసిందో-తనదేహం తనకి స్మృతి తెలియలేదు. పొద్దుపోయి, గాలీవానాలో పిల్ల ఇంకా ఇంటికి రాలేదని దిగులుపడి ఎదురుచూచే తల్లిదండ్రుల మనస్సుకి ఆమెఆగమనం స్థిమితం చేకూర్చింది. కాని పెంచెలి మనస్సుకు స్థిమితం చేకూరేది ఎన్నటికి?

ఇంటికి పోంగనే తడిగుడ్డలు విడిచి, పొడిగుడ్డలు కట్టుకొని, తడిసినతల తుడుచుకొని, తనకు ఆకలిలేదంటూ ఆరాత్రి ఉపవాసంచేసి పండుకొంది పెంచెలి.

పెంచెలి కారాత్రి కంటికి నిద్రరాలేదు. ఎట్లా వస్తుంది? రాయుడు తనగుండెల్లో పెట్టిన అగ్నికణాన్ని రగుల్కొల్పి పెద్దదిచేస్తున్నాడు. చిన్నతనం చపలత్వంచేత తనకు చెప్పి పంపించాడని ఆరంభంలో ఆమె లక్ష్యపెట్టకుండా తోసేసుకొంటూ వచ్చింది. కాని చూడగా అతడు పెద్దఆలోచనమీదనే ఉన్నట్టుగా ఉన్నాడు. వీలయితే తనను దౌర్జన్యంమీదనైనా లోబరుచుకోవలెననే ప్రయత్నంమీద ఉన్నాడు. లక్షాధికారి! బలవంతుడు! ఆయన అంతరం ఎంత, మాలకులంలో పుట్టిన తన అంతరం ఎంత? ఆదొరకు తనమీద ఎందు కీభ్రమ? ఆనాటిరాత్రి తన రోజు బాగుండి ఎట్లనో తప్పించుకొని పారిపోగలిగింది కాని, ఆపెద్దపులిని తప్పించుకొని ఎన్నాళ్లని తా నాగడ్డమీద తిరగగలదు? పోనీ, ఈ సంగతి రొబ్బడితో చెప్పి, తొందరగా పెళ్లిచేసి తీసుకొని పొమ్మంటేనో! అమ్మో, ఈ విషయం అతని చెవికిపోతే తనను గురించి అత డేమి సందేహిస్తాడో! అసలు తాను నోరువిడిచి ఇట్లా ఇట్లా జరిగిందని అతనితో చెప్పడం ఎట్లా?

పోనీ, తల్లితోగాని, తండ్రితోగాని తన బాధ చెప్పుకొంటే?—చెప్పి ఉపయోగం ఏముందీ? వాళ్లిద్దరి మనస్సుకూ లేనిపోని దిగులూ, విచారమూ కొనితెచ్చి పెట్టడంతప్ప. వాళ్లబ్రతుకీ వాండ్లుపోయి ఈవిషయమై రాయుడితో తగువులాడగలరా? — ఎంత ఆలోచించుకొన్నా ఆమెకు గత్యంతరం తోచలేదు. తా నీవిషయమై నోరు విప్పినట్టయితే నలుగురునోటా పెళ్లికాని పిల్ల, తనే రచ్చా రావిడీ అల్లరీ పడేట్టుగా కనిపించింది కాని తా నెంత వ్యక్తిగల ఆడదయినా, కేవలం లోకానుభవంలేని తనవంటి బాలికకు, ఆస్థితిలో సంభవించిన విపత్తు నెదుర్కొని నిగ్రహించడానికి ఆమెకు గుండెనిబ్బరంచాలలేదు. కడుపులో పెద్దభయమూ దుఃఖమూ పుట్టుకొనివచ్చినవి. తండ్రికీ తల్లికీ తెలియకుండా ఆరాత్రి తెల్లవార్లూ ఏడుస్తూనే పండుకొన్నది పెంచెలి.

రాయుడికిమాత్రం ఆరాత్రి కంటికి కునుకు ఎట్లా వస్తుందీ? రాత్రి భోజనంచేసుకొని, మిద్దెమీద రెండో అంతస్తుగదిలో పందిరిపట్టెమంచంమీద శయనించినప్పటికీ, మాలవాడలో తాటాకుగుడిసెలో నులకకుక్కిమీద పడి పొర్లుతూఉండే పెంచెలిస్థితికంటె హీనంగా ఉన్నది అతగాడిస్థితి. కళ్లెం తెగిన గుర్రంలాగ, విచ్చలవిడిగా సంచరిస్తోంది అతని మనస్సు. ఆరునెలలకిందట తనచేలో వరినాటు వేళలకి చూచినపుడు తన హృదయఫలకంమీద హత్తిపోయిన పెంచెలి బింబం అతన్ని పిశాచంలాగ పట్టుకొని పీక్కొని తింటోంది. మనోగతమైన ఆ బింబాన్ని సాకారంగా హస్తగతంచేసి తీరుతానని అతని ధనలక్ష్మి అత డాశవదలుకొన్నకొద్దీ అభయహస్త మిస్తూనే వుంది అతనికి- తాను కామించింది ఆస్త్రీఅవయవసౌభాగ్యసంపత్తికాని, ఆమాలదాని కులం కాదుగా! తనవల్ల నిత్యమూ ఎన్నో సహాయాలుపొందే

ఒకబీదమాలకుటుంబంలో పుట్టిన ఆపిల్ల తనయెడల అంతమాత్రం కృతజ్ఞత చూపలేదూ!

పెంచెల్ని సాధించడం ఎట్లా???
తల పగిలిపోతోంది రాయుడికి.

ఆ రాత్రి మాలవాడలోని పెంచెలికీ, మేడమీది రాయుడికీ కాళరాత్రే! గుర్రపుసాలలో చింకిరిచాప మీద శయనించిన రొబ్బడుమాత్రం ఒళ్లెరగడు — గాఢసుషుప్తిలో!

3

కాలవైపరీత్యం— బళ్లు ఓడలూ, ఓడలు బళ్లూ అవుతూఉంటవి! మన రాయుడితాత, తన హయాంలో ఉప్పుకావిళ్లు మోసుకొని జీవించేవాడట! అయితేనేం? అది ఎప్పటిసంగతో— పురాతనంనాటిసంగతి; రాయుడి కుటుంబానికి, అతని తండ్రిహయాంలోనే అందుకొన్నది—శుక్రమహాదశ! ఆరంభంలో అతగాడు అయిదువందల రూపాయలు అప్పుచేసి, పూనా బొంబాయి ప్రాంతాల్లో ఆరంభించిన ముత్యం, పగడాల వ్యాపారం, పట్టిగడ్డమీది తోటకూరకాడలాగ రెపరెపలాడుతూ నిమిషాలమీదా, ఘడియలమీదా ఎక్కివచ్చి, ప్రాణం హరీ అనేవరకు అతడు లక్షరూపాయల ఆస్తిని గడించి, కొడుకు రాయుడిచేతిలో పెట్టి మరీ చచ్చిపోయాడు. ఇంతకీ అదృష్టమంటే రాయుడిదిగాని, నిజంలో అతని తండ్రిది కానేకాదు. తండ్రి సంపాదించి యిచ్చిపోయిన నూరు ఎకరాలమీదా ఏటా పండే నూరుపుట్ల ధాన్యమూ, ఇంటిచుట్టూ కొట్లు కట్టించి నిలవచేసుకొని, కోస్తాలో ధాన్యానికి ధర ఎప్పుడు ఉబుకుతుందా అని తపస్సు చేయవలసిన బదనాయంతప్ప, ఇక ఇతరవిధమైన బాధ్యతగాని, చీకుగాని, చింతగాని ఎరగడు ఆ మానవుడు! పుట్టుభోగి: ముఘర్యోళ్లు నిండిన నిండుజవ్వనం! ఏడుకావిళ్లరూపాయల సంచులతో మొన్ననే కాపురానికి వచ్చినభార్య-పెంచెలికంటె కూడా తనకి పచ్చిపచ్చిగా, వగరు వగరుగా ఉంది ఇంకా! అందీ అందనట్టు ఉవ్విళ్లూరించే దొరకాయ — ఆ పెంచెలి తన మనస్సులో విషం కలిపి ఊఁ కలిచివేస్తోంది.

పెంచెలి తన చెయ్యిజారిపోయిన రాత్రికి అనంతరం వారంరోజుల కొకనాడు సాయంత్రం రాయుడు మిద్దెమీద వసారాలో గచ్చు అరుగుమీద రెడ్డికం వేసుకొని చుట్టకాల్చుకొంటూ పండుకొన్నాడు. ఆనాటి రాత్రి పశువులకొటంలో వ్యవహారం అంతా చెడగొట్టిన చవట పెద్దమ్మ, మతరాచు సుబ్బడు మిద్దెక్కి,

"దానికప్పుడే పెళ్లిమనువుకూడా ఖాయంఅయిందంట" అని అన్నాడు.

రాయుడు ఉలిక్కిపడ్డాడు.

"దేనికిరా?"

"పెంచెలికే!"

"ఏవూళ్లో?"

"వాడి స్వంతవూరు పడమట బద్వేలి! మా ఆడదానివూరే వాడిదికూడా. నేను వాణ్ణి బాగా ఎరుగుదును. నేను నగరంసంతకి పోయినపుడల్లా వాడు నాకగుపడుతూనే వుంటాడు. తమ రెన్నడూ వాణ్ణి చూడలేదూ?"

"ఎవడురా వాడూ?"

"అదేందిసామీ! పోలీసుసూపరెంటుగుర్రం కాడ ఉంటున్నాడు నల్లంగా పొడుగ్గా- భారీమనిషి! తమరుకూడా చూసేవుంటారు గుర్తులేదేమో?"

"సూపరెంటు గుర్రంకాడ ఉంటాడా? వాడి పేరు?"

"వాడిపేరు రొబ్బడు. నెలకి పదిహేనో ఇరవయ్యో కాబోలు వాడికి జీతం! ఇప్పటికప్పుడే ఏడెనిమిదినెల్లనించీ, వాళ్లిద్దరూ పెళ్లిచేసుకోవాలని తీర్మానం చేసుకొన్నారంట! వాడెన్నడూ నాతో అననేలేదీసంగతి: నిన్న తెలిసింది నాకు మాలవాడలో!"

"అట్లనా?"

"మనకు తెలియనే తెలియదు సామీ! ఈ పిల్ల దినమ్మూ గడ్డిఎత్తుకొని వాడిదగ్గరికి పోయివస్తూనే ఉంట

దంట! వాడేమో నూపరెంటుఆసరా చూసుకొని, పెళ్లికి గుర్రమెక్కి ఊళ్లో ఊరేగాలనికూడా పట్టుపట్టాడనీ, అందుకు మాలవాళ్లుకూడా సరేనన్నారనీ మాలవాడంతా గోలగోలగా ఉండది."

"మనవూళ్లో మాలవాళ్లు గుర్రమెక్కి ఉత్సవం చేసుకొనే ఆచారం లేదు కాబోలు కదరా?"

"లేదు-సరే. వాడికి తేరగా గుర్రంచేతిలో ఉండె. పైగా పోలీసు నూపరెంటుఆసరా ఒకటి ఉండె. పెద్దమాలవాడు అంకడూ, పెంచెలి అబ్బ వెంకటిగాడూ — పెద్దతలకాయలు, గుర్రమెక్కి ఊళ్లోకి వస్తే, తమబోటి గొప్పోళ్లంతా ఏం చేస్తారో అని అఙ్జాయిస్తా ఉన్నారంట! కాని- ఇప్పుడిప్పుడు బయల్దేరుతూ ఉండారే, ముందరిజుట్లు పెట్టుకొనే కుర్రకారు— వాళ్లుమాత్రం సంబరం చేసుకో వలసిందే అని హఠం పట్టి ఉండారంట."

"అబ్బో! శానాకథ పెరిగిందే!......"

"పాపం! మనసేద్యగాడు రోశిగాడు, ఒకటే గోల, ఈ పెళ్లి ఖాయమైనప్పటినుంచీని......"

"ఎందుకూ?"

"ఎందుకంటే, వాడు తల్లితండ్రి లేని దిక్కులేని పచ్చి! 'నీకు పిల్లనిచ్చి పెళ్లి చేస్తా'ననీ, 'ఇల్లరికం పెట్టుకొంటాననీ,' చిన్నప్పటినించీ వాడి మేనమామ వెంకటిగాడు ఆశపెట్టి, వాడికి తమరు ఏటాయిచ్చే జీతంవడ్లు పుట్టి ఏడుంగింజలూ వెంకటిగాడే కాజేస్తా, తీరా ఇప్పుడు ఆ పిల్లకి పెళ్లీడు వచ్చేవరకు, దాన్ని పరాయిచోట యిచ్చిచేస్తున్నాడని, రోశిగాడు ఒకటే గోల...పాపం!"

"అయితే మన రోశిగాడికి, వెంకటిగాడు సయానా మేనమామా?"

"ఓ వేలు విడిచిన మేనమామకాబోలు! అయితే మట్టుకు, ఇన్నేళ్లుగా ఆశపెట్టి, నోరులేనివెధవ, వాడిచేత అన్నిపనులూ చేయించుకొని, చూడండి, ఇప్పుడెట్లా ఎదురు తిరిగారో వాళ్లందరూకూడా......"

"అసలు పిల్ల ఏమంటుందీ?"

"అదో మిడిమేలపులంజ: దానికి అపడమటాడి మీదనే మరులు! ఆ గుర్రం, ఆ సంబరం, ఆ ఊరేగడం...ఈదరువుమీదనే ఉండ దది. ఇట్లాంటి చవటల్ని దగ్గరకి రానిస్తుందా మొదలు?"

"అట్లనా?.............."

"ఆరోశిగాడు - నోరులేని కుంక- ఒకటేగోల! అందులో ఆపిల్ల ఎర్రగా బుల్లగా కాస్త కంటికి నదరుగా అగుపడే చట్టమైన పిల్లేమో — దాన్ని విడిచిపెట్టుకోవాలంటే, వాడు దిగులుపడి చస్తుండాడు."

"ఆ వెధవసంగతికేంగాని, నువ్వు మళ్లా దాన్ని అడగలేదటరా?"

"అడగకేం! ఈవారం రోజులుగా అడిగి అడిగి, ప్రాణం చాలొచ్చింది నాకు. అబ్బో! అది అసాధ్యపు లంజ సామీ! మనం ఒక్కమాట మాట్లాడితే, అది పది మాటలు చెప్పతుంది. అది మనకి అలివి అయ్యే మనిషి కాదు—"

"....................."

"మా దొర నిన్నేం చేయడులేవే! ఒక్కపాలి ఆయనకాడికి వచ్చి ఒక్కమాట మాట్లాడిపోదువుగాని రమ్మంటే, రాను పొమ్మన్ది దాని దొకటే పాట! ఇక దాన్నడగడమే నాకు చిన్నతనంగా ఉండది సామీ!"

"సరే! ఇక నువ్వు దానితో ఈ ప్రస్తావన ఏమీ చేయనేవద్దు. పలక్కుండా ఊరుకో!......"

"చిత్తం!......కాని దొరలు ఎట్లనయినా, ఈపెళ్లి నిలుపుదల అయ్యేటట్టు చేయిస్తిరా, దాని రోగం కుదురుతుంది; అటుతర్వాత మన చెప్పకింద తేలయి పడిఉంటది-" అంటూ మిద్దెదిగి వెళ్లిపోయాడు సుబ్బడు.

రాయుడికి మనస్థిమితం చెడింది: పరిపరివిధాల పోతోంది అతనిమనస్సు: అతని నోటిలోనిచుట్ట చివర ఎర్రడాలు ప్రస్ఫుటంగా గోచరిస్తోంది. పెంచెలి చెయ్యిజారిపోతోందని అతనికి ఒకవిధమైన ఖంగారు

పుట్టింది. పోతేపోయింది. తనయెడల అదిచూపిన అవిధేయతకు దానికి తగినశాస్తి చేసి విడిచిపెట్టితేనే గాని వీల్లేదని అతనికి క్రోధం ఉద్రేకించింది. తనగ్రామం అంత నిర్భయంగా ప్రవేశించి, తాను కాంక్షించిన వస్తువును తీసుకొని పోదలచిన ఆ మొనగాడెవరా అని అతనికి ఆలోచన కలిగింది! అతనికి చికాకనిపించి పండుకొన్న మనిషి లేచి వసారాలో ఇటూ అటూ పచారులారంభించాడు.

రాయుడుది పిన్నవయస్సయినా మొదటినుంచీ పట్టుదలమనిషీ, హఠవాదీని. తనను ఎదిరించిన మనిషిని సాధించి, రాచిరంపాన్న పెట్టేవరకూ అతగాడికి నిద్రపట్టదు. పైగా అతగాడికి ఆగ్రామంలో ఎదురులేదు. ఆఖరుకు తనంతటి మనిషికి ఒకమాలదానివల్ల పరాభవం కలిగిందే అని అతనికి అరికాలిమంట నెత్తికెక్కింది. చిన్నపిల్ల, నిదానంమీద అదే అంగీకరిస్తుందని ఎంత దూరం ఓర్పు వహించినా, చివరకు అతనిబేలతనమే బయట పడిందిగాని—కార్యసాఫల్యం కానేలేదు. “ఛా! నోరువిడిచి ఎందుకు అడిగాను దాన్ని” అని జుగుప్సపడ్డాడతడు.......కానీ..........చూతాం...... అనుకొన్నాడు. ఈవిషయం మళ్లా రెండో చెవికి రానే కూడదనుకొన్నాడు. ఆరాత్రి తెల్లవార్లూ, తన బుద్ధికి పదునుపెట్టి ఆలోచన సాగించాడు. మెదడు వేడెక్కుతోంది. కాని, పద్మవ్యూహానికి పథకం కుదరడంలేదు.

తెల్లవారుజామున కోడికూతవేళకు అతని కొక పథకం కుదిరింది. అప్పటి పరిస్థితుల్లో పనిచేయదగ్గది అదొక్కటే మందు: ఆగరళం పనిచేస్తే చేసినట్టూ లేకుంటే లేనట్టూను అనుకొన్నాడు.

ఉదయం నిద్ర లేచీలేవడంతోనే ముతరాచు సుబ్బడికి కబురుచేశాడు. వాడితో ఏదేదో మాటాడి, చివరకు ఈ విషయంలో తన పేరు బయటికివస్తే గొంతుక పిసుకుతానని చెప్పి వాణ్ణి పంపివేశాడు.

“చిత్తం. ఆ పని అంతా నేను చక్కబెట్టుకొని వస్తానుగా—” తమరి కొసందేహం ఏమీ పనిలేదు. అంటూ వెళ్లిపోయాడు సుబ్బడు.

తెల్లవారి ఉదయం నాలుగు ఘడియల పొద్దెక్కిన తర్వాత గ్రామంలో ఇతర పెద్దతలకాయలను— చలమానాయుణ్ణీ, సభాపతినీ, శింగరశెట్టినీ పిలిపించాడు రాయుడు; వాండ్లతో రహస్యంగా మంతనాలుచేసి గ్రామంలో మాలవాళ్లు కొత్తగా గుర్రా లెక్కి ఉత్సవంచేసుకొంటూ ఉంటే పెద్దతలకాయలు నలుగురూ ఊరుకొంటారా, మీకుపౌరుషంలేదా, మీకు పరువులేదా అని వాండ్లనుచివాట్లుపెట్టి శివమెత్తించాడు. మాలవాళ్లు గనుక గుర్రంఎక్కి వీధిలోకి వచ్చినట్టయితే, గ్రామరైతు లందరూచేరి, తలకాయలు పగలగొట్టడానికి తయారుగా ఉన్నారు కాబట్టి జాగ్రత్త అని మాలవాండ్లకు తెలిసేలాగున ఊళ్లో ఒకవిధమైన పుకారు లేవదీశాడు—తాను తెరచాటునే నిలబడ్డాడు.

౫

పెంచెలి – ఏ ముహూర్తాన తన వివాహవిషయమై కలపెట్టిందోకాని ఆక్షణం లగాయతు ఆమెకన్నీ కడగళ్లుగానే కన్పట్టుతున్నవి. ఆమె మనస్సు శాంతీ, సంతోషమూ ఎట్లాంటివో ఎరగదు. గ్రామమూ, మాలవాడా కూడా, అట్టుడికినట్లు ఉడికిపోతున్నది. మాలవాడు గుర్రమెక్కి ఊళ్లో అడుగుపెట్టినట్లయితే ముక్కలు, ముక్కలుగా చెండాడుతామని ఊళ్లో రైతులూ, ఏమైనప్పటికీ ఈ పెళ్లికి మాత్రం వెనక్కి జంకకూడదని మాలవాళ్లూ— అప్పుడే రోషా లెక్కి వీరావేశంమీద కత్తులూ, కటార్లూ నూరుతున్నారు. మాలవాడలో పెద్ద పెద్ద తలకాయలు పదిమందీ కలిసి, ఇంతదూరం వ్యవహారం రాకుండానే, నెమ్మది మీదనే చక్కపెట్టుకొందామని యోచనతో గ్రామంలో పెద్దరైతులదగ్గరకు పోయి— ఈ ఆచారం ఒకవేళ ఆగ్రామంలో లేకపోయి నప్పటికీ, ఆచుట్టుపక్కల చాలా గ్రామాలలో అమలులో ఉన్నదనీ, పెళ్లికొడుకూ, పెళ్లికూతురూ ముచ్చటపడి వేడుక చేసుకోదలచినారనీ చెప్పుతూ, ఉత్సవం చేసుకోవడానికి ఉత్తర్వు ఇవ్వవలసిందని గ్రామపెద్దలనందరినీ ఆశ్రయించి అర్థించారు. కాని

ఉపయోగం కనిపించలేదు; రాయుడి దగ్గరికి పోయి ఆయనగారి రెండుకాళ్లూ పట్టుకొన్నారు. 'గ్రామంలో ఇతర పెద్దలందరూ ఇష్టపడితే తన ఆక్షేపణ ఏమీ లేదని మాలలతో బహిరంగంగా తియ్యనిమాటలు చెప్పతూ— గ్రామంలో మాలవాళ్లుకొత్తగా కోరే హక్కును వాళ్లకు ప్రసాదించినందుకు, మాలలందరూ కలిసి, ఆగ్రామ ఉమ్మడి ఖర్చులకు గాను పోగుచేసిన ఫండుకు 300-0-0 లు నజరానా చెల్లించినట్టయితే ఈ హక్కు శాశ్వతంగా మాలవాళ్లకి విక్రయం చేయడానికి గ్రామస్థులు సిద్ధంగా ఉన్నారని — లోపాయికారీగా రాయుడు మాలలకి కబురు చేయించాడు. కానివాళ్లదగ్గర అంతశక్తి ఏదీ? మాలవాడలో ఎందరిసంసారాల్లోని కుండబోచ్చెలు పోగుచేస్తే మూడువందల దమ్మిడీలు కాగలవు? ఎన్ని గుడిసెలు కూలదోస్తే మూడువందల చిన్నడబ్బులు కాగలవు? ఎన్నిసంసారాలు దిబ్బచేస్తే మూడువందల అణాలు కాగలవు? బాబో! మావల్ల కాదంటే, మావల్ల కాదని గుండెలుకొట్టుకొన్నారు మాలలు: అంతగా వ్యవహారం వల్ల తప్పి, మెలిబడితే కొండంత ఆసరా మూపరెంటుదొర ఉండనే ఉండాడని వాళ్లలోవాళ్లు ఇక ధైర్యం తెచ్చుకొని కూర్చున్నారు. అయితే అయింది, ఎంతకయినా తెగబడుదామని మాలవాండ్లు నడుముకు దట్టీలు బిగిస్తున్నారు.

పెళ్లికొడుకు మూపరెంటుదగ్గర ఉండేవాడన్న జంకుతోనే, రాయుడు తాను బహిరంగంగా ఏమీ కలహం పెట్టుకోకుండా, ఊళ్లో యితరరైతులనుమాత్రం లేవదీసి, వెనకతట్టు తాళహంగుచేస్తూ తాను తెర చాటునే నిలబడ్డాడు. అతనికి తెలుసు— దండోపాయం ఉపయోగంలేదని. అందువల్లనే తిరుగులేని యెత్తు ఎత్తాడు. లోకానుభవం గలవాడు. దీనికి సాధ్యంకాని దంటూ ఉండదని తెలుసు వతనికి.

మాలవాడలో జరిగే ఈ గలభాకి పెంచెలి తాళ లేకపోయింది. తన మూలాన్ని కొంపలూ కొంపలూ అంటుకొనిపోయేటట్లుగా ఆమెకు తోచింది.

“దానిట వాన గురిసిన స్వరం! సంబరం లేకుంటే మానె! అయినా నేనూ ఇంత పప్పూకూడూ తిని, కంకణాలు కట్టుకొని పెళ్లి అయిందనిపించుకొంటే శాన! ఆ రాయడు నన్నెట్టాగా బతకనిచ్చేటట్టులేడు: ఈ రచ్చ అంతా ఆయనగారు లేవదీసిందే! అప్పలూ, ఆవులూ కుమ్ముకొని లేగల్ని తన్నినట్లు, ఈ కొట్లాటలో నా పెనిమిటి కేం కీడుచేస్తారో, అయినా తల్లి తండ్రీలేని దిక్కులేని పచ్చి! నామీదనే కళ్లుపెట్టుకొని బతుకుతుండాడు: ఏమో! మా ఇద్దరి ప్రాణం సల్లంగుంటే ఇంత బొద్దాకూ నీళ్లూ తాగి బతుకుతాం! ఏమైనా సరే, ఈ సంబరం ముగించుకోమని ఆయన కాళ్లు పట్టుకొంటాను. ఒప్పుకొంటాడులే నే చెప్పితే వింటాడులే మామ!” అని మధ్యాహ్నం పన్నెండు గంటలకు ఎర్రటి ఎండ అని అయినా అనుకోకుండా బయలు దేరింది రొబ్బడిదగ్గరికి పెంచెలి.

నడినెత్తికి వచ్చి తేరి చూడడానికి వీల్లేకుండా నిప్పులు కక్కుతున్నాడు ప్రచండభాస్కరుడు. ఎండ తగలకుండా నెత్తిమీద కొంగుముసుగు కప్పింది పెంచెలి; గుర్రాన్ని గనక ఊళ్లోకి తీసుకొనిరాకుంటే ఇక తనపెళ్లి కేమీ కష్టాలులేవని స్థిమితపడింది; గుర్రాన్ని తీసుకొనిరాకుండా పెళ్లికొడుకు రొబ్బణ్ణే ఒప్పించి నట్లయితే తనకే బాధా ఉండదని ఆశించింది. వీధివాకిలి లోపటికి నెట్టి గుర్రపుశాలలోకి పోయింది పెంచెలి.

మంచి నడిజాముపొద్దు. ప్రజలు భోజనాలు చేసే సమయం, భోజనానంతరం విశ్రాంతి తీసుకొనే సమయమూను. రొబ్బడు ఆపూట అన్నంతిన్నాడో లేదో, గుర్రపుసాలలో చాపమీద ముసుగుతన్ని పండుకొని గాఢనిద్రలో ఉన్నాడు. గుర్రంకూడా వాడివైపు చూస్తూ ఏదో విచారాన్ని సూచిస్తూ ముడుచుకొని పోయి నిలబడిఉన్నది. అంత గాఢనిద్రావస్థలో ఉండిన తన ప్రియుణ్ణి లేవగొట్టనా వద్దా అని సందేహించింది పెంచెలి: కాని ఆమె తన మనస్సులోని ఆత్రం అరికట్ట లేకపోయింది. ఎర్రటి ఎండలో పేరెంమీదవచ్చిన వగర్పుతోనే—

“మామా! మామా!” అని అతనిపక్కనే కూర్చొని తలమీద ముసుగుతీసి రొబ్బణ్ణి నిద్రలేపింది. త్రుళ్లిపడి

నిద్రలేచాడు రొబ్బడు. ఎర్రటి చింతనిప్ప కణాలలాగ ముఖంలోకి ఉబికి నెత్తురు కక్కుతున్నాయి అతగాడి నేత్రాలు. పెంచెలికే ఆ ముఖవీక్షణం భయంకర మయింది; నిద్రలో లేచినందువల్ల ఆ విధంగా ఉన్నా డనుకొన్నది.

"మామా! మామా! మన కా గుర్రమూ వద్దు, ఆ సంబరమూ వద్దు, మామా!"

"నా కాగుర్రమూ వద్దు, ఆ సంబరమూవద్దు, ఆ పెళ్లీవద్దు" అన్నాడు రొబ్బడు.

ఉలిక్కిపడింది పెంచెలి:

"మామా! నిద్రకళ్ల నేందీ ఆ మాటలు! శుభ మల్లె పెళ్లెందుకు వద్దు?"

"సంబర మెందుకు వద్దు?"

"మాలాడు గుర్రమెక్కి వూళ్లో సంబరం చేసుకొంటే, తలకాయ పగులకొట్టుతామని ఊళ్లో పెద్ద పెద్ద ఆసాములందరూ కత్తికట్టి ఉండారు."

"మిండగాళ్లని మరిగినలంజ, నన్ను మోసంమీద పెళ్లి చేసుకోవాలని వస్తే తలకాయ పగలకొట్టాలని కఱ్ఱ చేతపట్టి ఉండాడు— ఈ రొబ్బడు."

"ఏందీ మామా! ఈ మాటలూ?"

"ఏందేలంజా! ఈ తప్పడుచేష్టలూ?" అని లేచి పెంచెలి కుడిప్రక్కన ఒక్కతన్ను తన్నాడు రొబ్బడు. పెంచెలి కేమీ అర్థంకాలేదీ వైఖరి. నిర్ఘాంతపోతోంది. అతన్ని అడుగుదామని అనుకొంటుంది—కాని నోరువిడి బడడంలేదు. ఇంతలోనే రొబ్బడు దానిజుట్టుపట్టుకొని "ఊళ్లోవాళ్లనందరినీ మరిగి నన్ను పెళ్లాడాలని తయారవుతావా లంజా?" అని దానితల కిందికి వంచి వీపు మీద పిడిగుద్దులు కురిపించాడు.

బాబోయి, బాబోయి అని అరవడానికి కూడా నోరురాలే దా పడుచుకి! అతనివైఖరి కాశ్చర్యపోవడం తప్ప దుఃఖించడం చేతకాలే దా అబలకి. ముఖంమీద విడిబడ్డ కురులు సవరించుకొనేలోపలనే ఎప్పుడు తెచ్చాడో పదిబారల జనపనారపగ్గం ఒకటి తెచ్చి పెంచెలి రెండుచేతులూ వెనక్కి విరిచికట్టి ఆమెను బరబర లాక్కొనిపోయి గుంజకు కట్టివేశాడు రొబ్బడు. నోరు విప్పలేదు ఆభూదేవి! కళ్లు చారెడు చేసుకొని అతని ముఖంలోకి చూస్తూ నిలబడింది కొయ్యలాగ!

గుర్రాన్నితోలే కంచీ చేత తీసుకొని ఎదురుగా నిలబడ్డాడు ఆమె ప్రేమ హరించిన ప్రియుడు.

"నిజం చెప్పతావా చెప్పవా?"

ఆమె పెదిమెలు కంపించాయి.

"నువ్వు నీమేనత్తకొడుకు రోశిగాణ్ణి పెట్టు కొన్నావా లేదా?"

"రామ! రామ!" అంది ఆమె హీనస్వరంతో

"ఏడే నీ రాముడు?" అని అతడు ఉచ్చరించే లోపలనే ఆమె దేహంమీద కంచీ ఛెళ్లుమని పలికింది.

"మామా!............" అని మాత్రమే అవ గలిగింది ఆశీలవతి.

"ఆనాడు నువ్వు నాకాడనించి పోయినపొద్దు మీవూరుకాపు రాయుడి పసువుల కొఠంలో దూరావా?"

"దూరాను" అని సత్యవాణి పలికింది.

"ఎందుకు దూరావు?"

"వాన జల్లుకి భయపడి—"

"రంకుతనం అంటే భయంలేని దానికి నీకు వాన జల్లంటే భయమా?" అని తీవ్రంగా హెచ్చరించింది కంచీ!

"మామా ..."

"ఆ పాకలో ఏమి జరిగిందో నిజం చెప్పు!"

పెంచెలిముఖంలో మిడిగ్రుడ్లే అతనికి జవాబిచ్చాయి!

"పలకవేం?"—అని కంచీ ఆడించాడు రొబ్బడు—

ఆకంచీ చేసేధ్వనికి, దాని రుచితెలిసిన ఆ శరీరం భయపడి, బెదిరి కలగతొక్కుకొంటోంది—

పెంచెలి గొంతెండిపోయింది: గుటక పడడం లేదు. కళ్లు చీకట్లు కమ్ముతున్నాయి: కాని రెప్పలాడడంలేదు—నిజం చెప్పుతావా చెప్పవా అని రొబ్బడిచేతిలోని కంచీ యింకా సత్యాన్వేషణకొరకు పెంచెలిరక్తాన్నికూడా పరిశీలిస్తోంది.

"మామా—" అని నోరారా పిలవాలని ఆమె కోరిక. తన ప్రియుని కరువుతీరా కౌగిలించుకోవాలని ఆమె ఉబలాటం! తనమీద ఎంతప్రేమా, ఎంత విశ్వాసమూ లేనిదీ ఆ అమాయకుడికి, లోకం చెప్పిన చెప్పుడు మాటలమీద అంత ఆగ్రహంవస్తుందా అని ఆమెసంతోషం. ప్రేమసూచకములా?-ఆకంచీదెబ్బలకు ఆమెశరీరం ఉప్పొంగిపోతోంది—కాని ఆ అపూర్వమైన అనుభవంలో ఆమె బదులు చెప్పలేక నిశ్చేష్టయై తన్ను కట్టివేసిన కొయ్యకుంజలాగే కొయ్యలా నిలబడి ఉన్నది పెంచెలి—

మౌనం అర్ధాంగీకారసూచకమ? 'తనప్రశ్నకు జవాబు చెప్పకుండా, చేసినతప్పు ఒప్పుకొంటోంది ఈలంజ!', అనుకొన్నాడు రొబ్బడు. వాడికసి తీరడంలేదు. తానింకా పెండ్లాడని పిల్లే, ఆపిల్లమీద తానంత తీవ్రమైనఅధికారం చెలాయించవచ్చునా అనేయోచన మనస్సుకు తట్టలేదు ఆ పెళ్లికొడుక్కి. ఒకసంవత్సరంగా తనతో కపటస్నేహంచేసి మోసగించిందని అతనికి శరీరంయావత్తూ భగ్గున మంటలెత్తి పోతోంది! అందులో పోలీసు సూపరెంటుదొరదగ్గర నాకరీచేస్తుండే మనిషి తాను. వివాహం కాకపోయినప్పటికీ, తనమనస్సూ, తనదేహమూ, తన సర్వస్వమూ తన అధీనం చేసి వేసినట్లునటించింది పెంచెలి. అతనికి వీరావేశం విజృంభించడానికి, ఇంకా ధూపంఎందుకూ?

పెంచెలికి కట్టినకట్లు విప్పాడు! ఆమెదేహం తనంతట అదే అప్రయత్నంగా అతని పాదాలమీద పడిపోయింది- కాని, ఆక్రోధమూర్తికి జాలిఏదీ?

"చావు లంజా!" అని తనశక్తికొద్దీ దాని వీపుమీద ఒక్క పిడిగ్రుద్దు గుద్దాడు రొబ్బడు. తన కనిగ్రుడ్డులోని ఎరుపురంగుతో దీటయినరక్తం ఆమెనోట జల్లున ఒకగ్రుక్కెడు కక్కుకొనేటప్పటికి అతనికి ఈప్రపంచం తెలిసింది.

"ఓసీ! ఇంత మోసమా! చెప్పకో, నీ దిక్కున్నచోట చెప్పకో! నా కాపెళ్లీవద్దు, ఆ గుర్రమూ వద్దు, ఆ సంబరమూ వద్దు. ఈ సూపరెంటు దగ్గర నాకీ నౌకరీకూడా పనిలేదు. ఇప్పుడే లేచి పోతాను మా వూరికి" అని పైమీద గుడ్డవేసుకొని నోటివెంట నురుగులు కక్కుకొంటూ ఆక్షణమే లేచి చక్కాపోయాడు రొబ్బడు.

సాయంత్రం అయిదుగంటలయింది! అప్పటికి చల్లబడింది ప్రచండసూర్యబింబం. పెంచెలికి స్పృహ కలిగింది. లేచి కూర్చుంది. నలువైపులా చూచుకొంది! తాను ఏకాకిగా ఉన్నదా ఆవరణలో. ఒడలూ, గుడ్డలూ చూచుకొంది. నెత్తురుమరకలు ఆమె గుండె చెదరగొట్టాయి! ఆమె లేచి నిలబడింది. రెండుచేతులూ ఎత్తి గుర్రానికి దణ్ణంపెట్టింది. పెద్దనవ్వు నవ్వింది...మామా... మామా...అని పిలిచింది: పెద్ద ఏడుపు ఏడిచింది. సూర్యాస్తమయం కాబోతోంది. పెంచెలి వీథిలోకి పోయింది.

విరబోసుకొన్న జుట్టు: చిరిగిపోయిన రవికగాట్లుపడ్డ దేహం! బూడిదలో పొర్లాడిన నెత్తురు మరకల చీర! వికృతాకారం! వికటాట్టహాసం! వెర్రి చూపులు! కారణంలేని ఏడుపు—ఆహా! ఇక మూడు రోజులకు మెడలో మంగళసూత్రధారణ చేయించుకోవలసిన పెండ్లికూతురా—ఆఅవతారం!

వీథిలో తిరిగేకుక్కలు మొర్రో అని అరుచుకొంటూ ఆమె వెంటబడ్డాయి. తనని కరవమని వాటినోటికి తన చేతు లందిస్తుంది—పెంచెలి వీథుల్లో ఆడుకొనే పిల్లలు చిన్నచిన్న రాళ్లుతీసి ఆమెమీద రువ్వుతూ దూరంగా పోయి కేకలుపెట్టుతున్నారు. తనతల పగలగొట్టుమని పెద్దపెద్ద బండలుతీసి ఆపిల్లల కివ్వబోతుంది. వచ్చేపోయే మోటారుకార్ల కింద, బండ్లక్రిందా పడిపోవాలని, రోడ్డులో వంకరవంకరగా నడుస్తుంది. కాని అవి అన్నీ ఆమెను తప్పించుకొని పోతున్నాయి-

పంజచీకట్లు విరిశాయి. పెంచెలి వికృతాకారం మరీ భయంకరమయింది. ఆమె ఇంకా పోతూనేవుంది. తన వూరికి పొయ్యేదారిలో రాయి పశువులకొఠం దగ్గిరికి వచ్చింది. పెద్దనవ్వునవ్వింది. పిచ్చిపాట పాడింది— ఆకొఠంచుట్టూ తిరిగింది — కానుగచెట్టు కిందికి పోయింది. మామా అని దాన్నిగట్టిగా కౌగిలించుకొంది—కళ్లుమూసుకొంది—పెద్దంగా ఏడిచింది. మామా రా అంటుంది. నేనూ వస్తా అంటుంది. ఇటూ ఆటూ పరువులెత్తింది. అటూ ఇటూ రెండు బెడ్డలు విసిరింది. అర్థంలేని కేకలువేసింది. రెండు మాలగద్దలు పశువులకొఠంమీద వాలాయి. వాటినిచూసింది. పెద్ద వెనవ్వునవ్వింది; మామా అంటూ కింద తూలిపడిపోయింది.

నీరెండ —K. K.